# ఆదివాసీ బిడ్డ శిరీష హత్య అత్యంత హేయం

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి..**

**మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి లక్ష్మీకుమారి**




**కొత్తగూడెం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):** ఉపాధి కోసం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పరిధిలోని తుక్కుగూడలో నర్సుగా పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గిరిజన యువతి శిరీష దారుణ హత్యకు గురికావడం అత్యంత హేయమని సీపీఐ అనుబంధ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి అన్నారు. ఘటనపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హత్యపై సమగ్ర దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రతకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబానికి తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రి వద్ద గిరిజన, ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కరిష రత్నకుమారి, షేక్ షాహిన్, క్రైసర్, దారా లక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియా సమస్యలు పరిష్కరించాలి

**జీఎం వెంకటరమణను కలిసిన ఐఎన్‌టీయూసీ నేత ఎండీ రజాక్**



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):** కొత్తగూడెం సింగరేణి ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ కోరారు. ఈ మేరకు శనివారం ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సౌకర్యార్థం జీఎం కార్యాలయంలో క్యాంటీన్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కార్మికుల పిల్లలు, కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన డేటా షీట్‌ను ముందుగానే అందజేసి తప్పులను సరిచేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. లేదంటే పదవీ విరమణ అనంతరం వివరాల సవరణకు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి జీఎం సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రజాక్ తెలిపారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**50 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఘన సన్మానం**



**కొత్తగూడెం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా, డీఈఓ డి. వాసంతి కన్వీనర్‌గా నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ గురువులు విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన 50 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులను శాలువాలు, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోడ్రన్ ఇఖ్రా స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం వేడుకలు



**కొత్తగూడెం, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి)** కొత్తగూడెం కార్పోరేషన్ లోని సుభాష్ చంద్రబోస్ నగర్ రామవరం లోని 12 వ వార్డులో గల మోడ్రన్ ఇఖ్రా స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువుల ఔన్నత్యాన్ని చాటి చెబుతూ తెలుగు, హిందీ,ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో విద్యార్థులు ప్రసంగాలు, నృత్య ప్రదర్శనలతో గురువుల గొప్పదనాన్ని చాటి చెప్పారు. అలాగే తరగతుల వారిగా విద్యార్థులు తమ తమ క్లాస్ టీచర్లకు కానుకలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ నేటి భౌతిక వాద సమాజం లో విద్యను వ్యాపార దృక్పథం తో చూస్తూ గురువులను గౌరవించటం లేదని ఇది సరికాదన్నారు. సంవత్సరాల తరబడి అదే తరగతి గదుల్లో ఉంటూ, తమ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే నిస్వార్థ పరులైన టీచర్లను మనమంతా గౌరవించిన నాడే దేశాభివృద్ధి సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు శిరీష, సల్మా, నాజీయా, సరస్వతీ, లతీఫా, జేఫీషా, అనితా, విజయలక్ష్మి, సుహాన, కమల తదితరులు పాల్గొన్నారు.

# కొమరయ్య ఆశయాలే కార్మిక ఉద్యమానికి బాట

**- పెన్షన్, బోనస్ వంటి హక్కులు ఆయన పోరాట ఫలితమే: ఎమ్మెల్యే కూనంనేని**



కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి): సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నాయకుడు కొమరయ్య సేవలు చిర స్మరణీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొమరయ్య 30వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాలోని వివిధ గనులు, విభాగాల వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కొమరయ్య చిత్ర పటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కార్మికులకు నేడు లభిస్తున్న అనేక సంక్షేమ హక్కుల వెనుక కొమరయ్య వంటి నాయకుల సుదీర్ఘ పోరాటం ఉందన్నారు. పెన్షన్, దీపావళి బోనస్, ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కొమరయ్య సాధించిన హక్కులను కాపాడుకోవడంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన అగ్రిమెంట్లపై కొన్ని సంఘాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. కార్మికులకు ఉపయోగపడే నిర్ణయాలను రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శించడం సరి కాదన్నారు. కార్యక్రమాల్లో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు శేషయ్య, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఏరియా బ్రాంచ్ కార్యదర్శులు జక్కుల గట్టయ్య, రమణమూర్తి, సుధాకర్, ఉపాధ్యక్షులు కత్తర్ల రాములు, క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి సామల రాము, పిట్ కార్యదర్శులు, కాంట్రాక్ట్ కార్మికుల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు డబ్ల్యూపీఎస్, జీఏ కమిటీల్లో అవకాశం కల్పించాలి

**- మూడు విభాగాలకు క్యాంటీన్ సౌకర్యం ఏర్పాటు చేయాలి: బీఎంఎస్ నేత మొగిలిపాక రవి**



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):** కొత్తగూడెం ఏరియాలో ఉద్యోగుల సంక్షేమంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించాలని బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి కోరారు. ఈ మేరకు శనివారం ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్. వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు.కోల్ ఇండియా, పబ్లిక్ సెక్టార్ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సింగరేణి క్రీడాకారులకు డబ్ల్యూపీఎస్, జీఏ కమిటీల్లో కోఆర్డినేటర్, జనరల్ కెప్టెన్, ఈవెంట్ కెప్టెన్ వంటి బాధ్యతలు అప్పగించాలని కోరారు. క్రీడా అనుభవం, ప్రతిభ ఆధారంగా ఎలాంటి ట్రేడ్ యూనియన్, రాజకీయ ప్రమేయం లేకుండా అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అనలిటికల్ ల్యాబొరేటరీ, సివిల్ డిపార్ట్ మెంట్, ఎంవీటీసీ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి ఆయా ప్రాంతాల్లోనే నాణ్యమైన క్యాంటీన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కాసర్ల మోహన్, నాగేశ్వరరావు, రాంబాబు, సింగరి శ్రీనివాస్‌రావు, నర్సింగరావు, బి. నాగేశ్వరరావు, ఫణిభట్ల ఆత్రేయ, కే. ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో కదం తొక్కిన విద్యార్థులు, యువత

**బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ..**

**13 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్**





**కొత్తగూడెం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మార్కెట్‌యార్డు నుంచి గణేశ్ టెంపుల్ వరకు సాగిన ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్లకార్డులు, జెండాలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వారితో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.గణేశ్ టెంపుల్ వద్ద జరిగిన సభలో రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు, యువత శక్తి ముందు ఎలాంటి పాలకులైనా తలవంచక తప్పదన్నారు. రాష్ట్రంలో రూ.13 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బందిగా మారిన జీవో 97ను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ సంకుబాపన అనుదీప్, నియోజకవర్గ అధ్యక్షుడు మధుచంద్, పార్టీ నాయకులు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఒడికి మరో రూపం అంగన్వాడి టీచర్

**- టీచర్స్‌ని శాలువాలతో సత్కరించిన కార్పొరేటర్ మునిగడప పద్మ**



**కొత్తగూడెం (తెలంగాణ వాణి)** అమ్మ ఒడికి మరో రూపం అంగన్వాడీ టీచర్స్ అని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ అన్నారు. శనివారం నెహ్రూ బస్తి అంగన్వాడి సెంటర్ లో జరిగిన టీచర్స్ డే కార్యక్రమంలో అమ్మ కడుపులో పడిన నాటి నుంచి పాపాయి పాలు తాగే వయసు దాటి బడిబాట పట్టే వరకు ప్రతిక్షణం కంటికి రెప్పలా చూసుకుంటూ మరో అమ్మగా నిలిచే ప్రేమ మూర్తులు అంగన్వాడీ టీచర్స్ ఆమె కొనియాడారు. నడక నేర్పే తొలి అడుగుల్లో ఆరోగ్యాన్ని ఇచ్చే పౌష్టికాహారం తో పాటు ఆటపాటలతో వేసే తొలి చదువులో పునాదిలో మీ సేవలు అమూల్యం, అద్భుతమని అంగన్వాడీ టీచర్స్ ఉద్దేశించి అన్నారు. పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ, సమాజ ఆరోగ్యానికి పునాదులు వేస్తున్న అంగన్వాడీ టీచర్స్ కి, ఆయాలకు టీచర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డివిజన్లోని మూడు సెంటర్ల అంగన్వాడి టీచర్స్ ని కార్పొరేటర్ మునిగడప పద్మ శాలువాలతో, పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా సెంటర్ లోని తల్లిదండ్రులు కుమార్ స్వాతి దంపతులు సెంటర్ కోసం టేబుల్ ఫ్యాన్ ను బహుమతిగా ఇవ్వడం మరియు కోరి ప్రియాంక అశోక్ కుమార్ దంపతులు రెండు కుర్చీలను బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఎన్ సరోజ, దొంగ నీలవేణి, రమాదేవి, షహనాజ్ బేగం ఆయా వెంకటలక్ష్మి, తల్లులు మరియు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞానపు చీకట్లను తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించేది గురువు



**కొత్తగూడెం, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కూలీలైన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని 1962 నుంచి ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల తర్వాత గురువుకు అత్యున్నత స్థానం కల్పించిన గొప్ప సంస్కృతి మనదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అమూల్యమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గణేష్, ఉపాధ్యాయులు సాయి చందు, సుభాషిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం



**చుంచుపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):** మండల ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన ఉపాధ్యాయుడు వారణాసి వెంకటేశ్వర్లు, ఆయన సతీమణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహాసభ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, వారణాసి సురేష్, వందనపు వీరభద్రం, దివ్య సైకిల్ స్టోర్ సాయి పాల్గొన్నారు.

# సింగరేణి ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):** సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌సీఈఎస్ జీఎం బి. రాజేంద్రప్రసాద్, జీఎం (ఎడ్యుకేషన్), పాఠశాల కరస్పాండెంట్ కాంతారావు, ప్రధానోపాధ్యాయుడు సూర్యకాంత్ తదితరుల సమక్షంలో పాఠశాల సెక్యూరిటీ క్యాబిన్‌ను ప్రారంభించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. యాక్టింగ్ టీచర్లను అభినందించి, పదో తరగతి పరీక్షల్లో తమ సబ్జెక్టుల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులకు నగదు పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీర ప్రసన్న, సంతోష్, వెంకన్న, ఎన్‌సీసీ ఏఎన్ఓ ప్రశాంత్, క్యాడెట్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గొల్లపల్లి క్లస్టర్‌లో క్రాప్ బుకింగ్ నమోదు



**టేకులపల్లి, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి):** గొల్లపల్లి క్లస్టర్ పరిధిలో శనివారం క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని ఏఈఓ బి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించి, క్రాప్ బుకింగ్ నమోదు విధానం, దాని ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఇల్లెందు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ బుర్ర ధర్మయ్య గౌడ్‌తో పాటు రైతులు విజయమోహన్‌రావు, నారందాసు, నరసింహారావు, బండి శంకర్‌గౌడ్, లావుడియా సురేష్‌నాయక్, చలమల నరేందర్‌గౌడ్, వాంకుడోత్ రవీందర్, వెంకటేశ్వరరావు నాయక్, వాంకుడోత్ బాలు నాయక్, బోడ జగదీష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గురువులకు ఘన సన్మానం

**ఎంపీపీఎస్ వాగొడ్డు తండాలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**



**టేకులపల్లి, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి):** టేకులపల్లి మండలం వాగొడ్డు తండా ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు భూక్య వీరన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు లక్ష్మ పాల్గొని ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు రాణి, భానుప్రియ, చైతన్యలను శాలువాలతో సన్మానించారు. అలాగే ప్రధానోపాధ్యాయుడు భూక్య వీరన్న, బానోతు లక్ష్మలను సత్కరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను నేర్పిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని లక్ష్మ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ల అంశాన్ని అగ్రిమెంట్లకు ముడిపెట్టొద్దు

**ఐఎన్‌టీయూసీ నాయకులు దుష్ప్రచారం మానుకోవాలి**

**ఏఐటీయూసీ నాయకులు వీరస్వామి, జక్కుల గట్టయ్య**




**కొత్తగూడెం, సెప్టెంబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పీవీకే--5లో సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ పోస్టుల అంశాన్ని ఆర్ఎల్‌సీ సమక్షంలో యాజమాన్యంతో ఏఐటీయూసీ కుదుర్చుకున్న అగ్రిమెంట్లకు ముడిపెట్టి ఐఎన్‌టీయూసీ నాయకులు చేస్తున్న ప్రచారం వాస్తవాలను వక్రీకరించడమేనని ఏఐటీయూసీ కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య అన్నారు.
అండర్‌గ్రౌండ్ జనరల్ అసిస్టెంట్లను సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా కన్వర్షన్ చేయించేందుకు ఏఐటీయూసీ నిరంతరం పోరాడిందన్నారు. సీనియారిటీ ఆధారంగా కన్వర్షన్ చేయాలన్న యాజమాన్య నిబంధనను వ్యతిరేకించి, పోరాటం ద్వారా కొత్తగూడెం ఏరియాలో ఆ నిబంధనను రద్దు చేయించామని తెలిపారు. ఖాళీల భర్తీ కోసం జీఎం కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టి, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశామని పేర్కొన్నారు. మణుగూరు సర్ఫేస్ కార్మికులను కొత్తగూడెంకు బదిలీ చేస్తామంటూ కొందరు ఐఎన్‌టీయూసీ నాయకులు డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సత్తుపల్లి సర్ఫేస్ టు సర్ఫేస్ కన్వర్షన్‌లో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ నాయకులు యాజమాన్యానికి వినతిపత్రం ఇచ్చిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.
ఆర్ఎల్‌సీ సమక్షంలో సాధించిన అగ్రిమెంట్లను కార్మికులకు వివరిస్తూ గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తుంటే కొందరు ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దుష్ప్రచారం మానుకుని శాంతియుత సమావేశాలకు సహకరించాలని సూచించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఏఐటీయూసీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సుధాకర్, పిట్ కార్యదర్శులు మధుకృష్ణ, కమల్, నాయకులు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిపై టీబీజీకేఎస్ చార్జ్‌షీట్

**కార్మికులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?**

**అండర్‌గ్రౌండ్ గనులు, సొంతింటి పథకం,**

**వడ్డీలేని రుణం, 250 గజాల స్థలం ఎక్కడ?**

**కేసీఆర్ హయాంలోనే సింగరేణికి సంక్షేమం..**

**మళ్లీ ఆయనే రావాలి: కుసాని వీరభద్రం**



**కొత్తగూడెం, సెప్టెంబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సింగరేణి కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల ప్రయోజనాలను విస్మరించాయని టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కుసాని వీరభద్రం ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగరేణి సంస్థపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కుసాని వీరభద్రం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చి గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఆ తర్వాత కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. అండర్‌గ్రౌండ్ బొగ్గు గనుల ఏర్పాటు, కార్మికుల సొంతింటి పథకం, వడ్డీలేని రుణం, 250 గజాల స్థలం, ఆదాయంపై ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో సింగరేణి కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశారని ఆయన పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం మళ్లీ కేసీఆర్ నాయకత్వం అవసరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో సింగరేణి కార్మికులకు మొండిచేయి చూపిందని విమర్శించారు.
కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మికులు పరిస్థితులను ఆలోచించి సింగరేణి సంస్థను, కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలి

**పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను కాపాడాలి**

**నష్టం కలిగించే 'శక్తి పాలసీ'ని**

**ఉపసంహరించాలి**

**స్కిల్ యూనివర్సిటీలో అనుసంధానాన్ని**

**అడ్డుకుంటాం**

**సాంకేతిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తే**

**సహించేది లేదు: కూనంనేని**




**కొత్తగూడెం, సెప్టెంబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉన్న జీవో నంబర్ 97ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో అనుసంధానం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాంకేతిక విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానికి భిన్నంగా వ్యవస్థను బలహీనపరిచే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు.
పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో అనుసంధానం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నష్టం కలిగించే 'శక్తి పాలసీ'ని ఉపసంహరించి, సాంకేతిక విద్యారంగంలో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలని కోరారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలపై అసెంబ్లీలోనూ గళమెత్తుతానని కూనంనేని స్పష్టం చేశారు. జీవో నంబర్ 97 ఉపసంహరణ జరిగే వరకు చేపట్టే పోరాటాలకు తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సలిగంటి శ్రీనివాస్, ఎస్.కె. ఫహీమ్ దాదా, వర్క అజిత్, తోట రాజు, ఖయ్యూమ్, రవికిరణ్, సలిగంటి నవీన్, వాడి కనకరాజు, ముత్యాల వినయ్, జావీద్, కాశి, కొయ్యడ రవి, సృజన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పోరేట్ ఏరియా డబల్యూపిఎస్ అండ్ జిఏ ఆధ్వర్యంలో డిపార్ట్మెంటల్ క్రీడలు ప్రారంభం



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి)**
ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కార్పోరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో 2026-27 సంవత్సర వార్షిక క్రీడలను శనివారం కొత్తగూడెం సిఈఆర్ క్లబ్లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిఎం (పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం (పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని, ఇందులో మంచి క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని, క్రీడలు అనేవి శారీరక దృడత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడే క్రీడలు కూడా ఎంతో అవసరమని ఇందుకై సింగరేణి సంస్థ ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఉద్యోగులు తమ తమ పనులను నిర్వహిస్తూనే క్రీడలలో ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు అందరూ తమ ఫిట్ నెస్ ను కాపాడుకుంటూ నిరంతరం సాధన చేస్తూ పతకాలు సాధించాలనే దృఢ సంకల్పం తో కోల్ ఇండియా స్థాయి పోటీలలో పాల్గొని మన సంస్థ మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు.
ఇందులో భాగంగా మొదటి ఆట గా బాస్కెట్ బాల్ మ్యాచ్ ను హెడ్డాఫీస్ వర్సెస్ ఎస్‌డిపిసి డిపార్ట్ మెంట్ గ్రూప్ మధ్య నిర్వహించగా హెడ్ ఆఫీస్ జట్టు విజయం సాధించినది. ఈ కార్యక్రమంలోడిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ బి.శివ కేశవ రావు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్‌టియూసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ఎస్.పితాంబర రావు, కార్పొరేట్ సిఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ కె.కమలాకర్, డివై.పిఎం వి.అనీల్ కుమార్, డివై.పిఎం ఓ హనరరి సెక్రటరీ కే.సునీల్ కుమార్,స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసి. పోస్ నెట్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సిహెచ్.రమేష్, బాస్కెట్ బాల్ కెప్టెన్ అరుణ్, బాస్కెట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# దత్తత పేరుతో మోసం.. రూ.1.40 లక్షలు కాజేసిన ముఠా!

**- నాలుగు నెలల బాబును దత్తతకు ఇస్తామని**

**నమ్మించి వసూలు**

**- ఆరుగురు నిందితుల అరెస్ట్.. రెండు బైకులు,**

**నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం**



**టేకులపల్లి, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి):**
నాలుగు నెలల పసిబిడ్డను దత్తతకు ఇస్తామని ఓ మహిళను నమ్మించి రూ.1.40 లక్షలు తీసుకుని మోసానికి పాల్పడిన ఘటన టేకులపల్లి మండలంలో వెలుగుచూసింది. దత్తత పేరుతో డబ్బులు తీసుకుని బిడ్డను అప్పగించకుండా పరారైన ట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు నిందితులను టేకులపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.40 లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**బిడ్డను దత్తతకు ఇస్తామని నమ్మించి..**

సంగారెడ్డి జిల్లాకు చెందిన గౌరీగారి ప్రమీలకు నాలుగు నెలల బాబును దత్తతకు ఇస్తామని నిందితులు నమ్మించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆమె నుంచి రూ.1,40,000 తీసుకుని బిడ్డను అప్పగించకుండా పరారైనట్లు పేర్కొన్నారు. మోసపోయినట్లు గుర్తించిన ప్రమీల టేకులపల్లి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**వాహన తనిఖీల్లో పట్టుబడ్డారు**

ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సెప్టెంబర్ 5న బొమ్మనపల్లి గ్రామ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దత్తత పేరుతో మోసానికి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు.
ఆరుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

**చట్టబద్ధమైన విధానాన్నే అనుసరించాలి**

డీఎస్పీ వెంకన్న బాబు, సీఐ బత్తుల సత్యనారాయణ మాట్లాడుతూ.. దత్తత పేరుతో డబ్బులు వసూలు చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మధ్యవర్తులను నమ్మకుండా, పిల్లల దత్తతకు సంబంధించిన చట్టబద్ధమైన అధికారిక విధానాన్ని మాత్రమే అనుసరించాలని కోరారు. అనుమానాస్పద వ్యవహారాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేసును ఛేదించిన సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై తిరుపతి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ వెంకన్న బాబు అభినందించారు.

# డాన్ బోస్కో పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలు



**తల్లాడ, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి) :**
మండల పరిధిలో పినపాక గ్రామంలో డాన్ బోస్కో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రదీప్ రెడ్డి, మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా విద్యార్థులు సాంస్కృత కార్యక్రమాలు తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అని ప్రదీప్ రెడ్డికి తెలియపరిచారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ. విద్యార్థులలో ప్రతిభను వెలిగి తీయటంలో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించడమే తమ లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ రాజేష్, ఫాదర్ చంద్రమోహన్, ఫాదర్ సునీల్, సిస్టర్ కమల, పాల్గొని. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, పునీత మదర్ తెరిసా చిత్రపటాలకు గౌరవ సూచికంగా పూలమాలవేసి కొబ్బరికాయలు సమర్పించి పుష్పాంజలి నివాళులర్పించారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డీఎస్ నాగేశ్వరరావు

**ఏన్కూర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి):**



గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాచలం గిరిజన భవన్‌లో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ సన్మానోత్సవంలో ఏన్కూర్ మండలం మూలపోచారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డీఎస్. నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఐఏఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చందన సర్ఫే, ఏపీవో డేవిడ్‌రాజ్, ఖమ్మం ఏసీఎంవో ఎల్. రాములు చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరించారు.
1994లో గిరిజన సంక్షేమ శాఖలో ఉద్యోగంలో చేరిన నాగేశ్వరరావు 32 ఏళ్లుగా గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. తెలుగు బోధనలో నూరుశాతం ఫలితాలు సాధిస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో విశేషంగా సేవలందిస్తున్నారు. అవార్డుకు ఎంపిక కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

# యూనివర్సల్ విద్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**తల్లాడ, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి):**
తల్లాడలోని యూనివర్సల్ విద్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి 'సెల్ఫ్ గవర్నమెంట్ సెలబ్రేషన్స్' నిర్వహించారు. తరగతుల్లో బోధనతో పాటు పాఠశాల నిర్వహణ బాధ్యతలను చేపట్టి తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రీ ప్రైమరీలో రమ్య, ప్రైమరీలో సమత, హైస్కూల్‌లో యాకోబును ఎంపిక చేసి శాలువాలతో సత్కరించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించడమే తమ లక్ష్యమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ




కార్యక్రమంలో కరెస్పాండెంట్ పీకే ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా, ఉపాధ్యాయులు, రవి, మనిషా ప్రమేల, రోహిణి, సమత , హేమ లావణ్య , సిరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ యూనిట్లు



**కొల్లాపూర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):**
నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి, సింగోటం గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న రెండు 800 కిలోవాట్ల (11 కేవీ) సోలార్ యూనిట్ల నిర్మాణ పనులకు మంత్రులు డాక్టర్ సీతక్క, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి శనివారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సోలార్ యూనిట్ల ద్వారా మహిళా సంఘాలకు అదనపు ఆదాయం సమకూరడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.
అనంతరం అంకిరావుపల్లి గ్రామంలో రూ.17.78 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రులు, ఎంపీ, కలెక్టర్ శంకుస్థాపన చేశారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం , సెప్టెంబర్ 6 , 2026

## ప్రభుత్వ ఆసుపత్రిలో సర్పంచ్ తనిఖీ



**అచ్చంపేట, సెప్టెంబర్ 05(తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి )**
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గ్రామ సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఉదయం వేళల్లో రోగులు అధిక సంఖ్యలో ఆసుపత్రికి వస్తున్నందున అవసరమైన మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.
ఈ తనిఖీలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మెడమోని భాస్కర్, అంతటి ఇన్చార్జి శేఖర్‌గౌడ్, నిరంజన్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు మేవా ఆర్థికసాయం



**బూర్గంపాడు సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భద్రాద్రి జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండలం మోతే కు చెందిన ఎస్ కె జాకీరా బేగం కు వైద్య ఖర్చులకోసం 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మోతే గ్రామానికి చెందిన ఎస్ కె జాకీరా బేగం భర్త పాష వీరి ఇద్దరి ఆరోగ్య పరిస్థితి బాగా లేని కారణంగా ఒకరికి జాకీరా బేగం క్యాన్సర్ ఫోర్త్ స్టేజి మరియు ఎస్ కె పాషా రోడ్ యాక్సిడెంట్ కారణంగా ఎడమ కాలుకి రాడ్ వేసి ఉన్నారు, కూలి పనులతో నివసించే వీరి కుటుంబంలో వైద్య ఖర్చుల కొరకు మరియు కుటుంబ నిర్వహణ కొరకు పెద్ద ఆర్థిక ఆపద ఏర్పడింది దీనిని గుర్తించిన మేవా కమిటీ సభ్యులు వీరి కుటుంబానికి మేవా కమిటీ నుండి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది, ఈ సందర్భంగా మేవా ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి తమ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఇందులో భాగస్వామీ అయిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నా మన్నారు, జాకీరా బేగం ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని కోరుకుంటున్నామన్నారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మహమ్మద్ ముస్తఫా, ప్రధాన కార్యదర్శి జహీర్ భాషా. సోహెల్ పాషా, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## పార్టీ కోసం 43 ఏళ్లు పనిచేసిన నేతకు ఇదేనా గౌరవం?

### లక్ష్మణ్ మృతదేహాన్ని పరామర్శించని టీడీపీ అగ్రనాయకత్వంపై స్థానిక నేతల ఆగ్రహం





**కొత్తగూడెం, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి)**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన సీనియర్ నాయకుడు ఊటుకూరి లక్ష్మణ్ మృతిచెందినా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ స్థాయి నాయకులు కనీసం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించకపోవడం తీవ్రంగా బాధాకరమని స్థానిక టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కోసం జీవితాంతం పనిచేసిన కార్యకర్తలు చనిపోయినప్పుడు కూడా నాయకత్వం పట్టించుకోకపోతే, కష్టకాలంలో పార్టీ కోసం నిలబడే కార్యకర్తలకు ఏం భరోసా ఉంటుందని ప్రశ్నించారు. 1983లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన నాటి నుంచి లక్ష్మణ్, ఆయన కవల సోదరుడు రాము పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి సేవలందించారని గుర్తుచేశారు. ఇటీవలే రాము మృతిచెందగా, తాజాగా లక్ష్మణ్ కూడా గుండెపోటుతో మృతిచెందడం కుటుంబానికే కాకుండా పార్టీకి తీరని లోటన్నారు.
చూపు కోల్పోయిన లక్ష్మణ్ వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసినా చివరి కోరిక నెరవేరకుండానే మృతిచెందడం మరింత కలచివేసిందన్నారు. కనీసం ఆయన అంత్యక్రియల సమయంలోనైనా పార్టీ నాయకత్వం స్పందించకపోవడం కార్యకర్తల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. స్థానిక టీడీపీ నాయకులు లక్ష్మణ్ మృతదేహంపై పార్టీ కండువా కప్పి కన్నీటి పర్యంతమై నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇల్లెందు నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ, పొన్నెకంటి సంజీవరాజు (టీడీపీ రాజు), బంగారి హరి, సామల మల్లికార్జున్, కంచం నాగులు, సురేష్ గౌడ్, గాధం రమణ తదితరులు పాల్గొన్నారు.



## లూర్దుమాత హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు








**తల్లాడ, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి) :**
లూర్దుమాత హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సత్య ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగింది. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు తమ ఉపాధ్యాయులను పూల మాలలతో ఘనంగా స్వాగతించి గురువుల పట్ల తమ ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను చాటుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఆకట్టుకునే నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రసన్న మాట్లాడుతూ, విద్యార్థులలో జ్ఞానంతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, సత్ప్రవర్తనను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన గురువులను గౌరవిస్తూ వారు చూపిన సన్మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ పాఠశాల యాజమాన్యం తరఫున ఉపాధ్యాయులందరికీ బహుమతులను అందజేశారు. విద్యార్థులు తమ గురువులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడంతో కార్యక్రమం ఆనందంగా ముగిసింది.

## రేపటి పల్లెల విధ్వంసం.. పడకేసిన పారిశుద్ధ్యంపై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



### - బిఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు

**జూలూరుపాడు : సెప్టెంబర్ 05 ( తెలంగాణ వాణి ):**
మండల కేంద్రంలోసెప్టెంబర్ 06న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు పిలుపునిచ్చారు. అనంతారం గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యదలపల్లి వీరభద్రం నివాసంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో గిరిబాబు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ ఆర్.జె.సి. కృష్ణ తదితర ముఖ్య నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 6 నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లకావత్ గిరిబాబు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు చాపలమడుగు రామ్మూర్తి, యదలపల్లి వీరభద్రం, రెడ్డిబోయిన రాము, పదిమల్ల రాంబాబు, పురస్తపురవు రామకృష్ణ, యల్లంకి సత్యనారాయణ నిమ్మటూరి కనకయ్య (ఉప సర్పంచ్) కుంజ లచ్చు, కుంజ రవి కుమార్ (ఉప సర్పంచ్), పద్దం ముత్తారావు, ఈసం వెంకటేశ్వర్లు మరియు తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కమిషన్ సాధన కోసం 8న నిరసన దీక్ష




**కొత్తగూడెం, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి)**
రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు, ఈడబ్ల్యూఎస్ కమిషన్ సాధనతో పాటు రెడ్డి సమాజానికి సంబంధించిన పలు డిమాండ్ల పరిష్కారం కోసం సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని రెడ్డి జాగృతి నాయకులు పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెడ్డి జాగృతి సభ్యులు పాల్వంచలో పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ముప్పాని సోమిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పగడాల నవీన్ రెడ్డి మాటాడుతూ.... రెడ్డి కార్పొరేషన్‌కు రూ. 1,000 కోట్ల నిధులు కేటాయించి, వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని, రెడ్డి సమాజ సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెంగారి మాధవరెడ్డి ఆధ్వర్యంలో జరిగే దీక్షను జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లను అన్ని ప్రభుత్వ విభాగాల్లో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ఈడబ్ల్యూఎస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. రెడ్డి సమాజానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెడ్డి సమాజ హక్కులు, సంక్షేమం కోసం చేపడుతున్న ఈ ఉద్యమానికి ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద జరిగే నిరసన దీక్షకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
"హలో రెడ్డి... చలో ఇందిరా పార్క్" అంటూ రెడ్డి సమాజ సభ్యులు, యువత, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.
రెడ్డి కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటుతో పాటు రెడ్డి సమాజానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. సెప్టెంబర్ 8న జరిగే నిరసన దీక్షను శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించి తమ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాం సుందర్ రెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్ రెడ్డి, రామ్ మోహన్ రెడ్డి, జీవన్ రెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం



**అచ్చంపేట, సెప్టెంబర్ 05(తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి ):**
విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్ భీమా అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట లో బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయడంతో పాటు ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు అచ్చంపేట ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు చదువులు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని, స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని శ్రీకాంత్ భీమా స్పష్టం చేశారు.

## పీఎం శ్రీ పాఠశాలలకు మార్గదర్శకంగా వాగేశ్వరి

### విద్యార్థుల్లో ఆవిష్కరణలు, పారిశ్రామిక ఆలోచనలకు ప్రోత్సాహం

**తిమ్మాపూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆవిష్కరణ, పారిశ్రామికవేత్తల సంస్కృతి అభివృద్ధి కార్యక్రమానికి వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎంపికైంది. ఇందులో భాగంగా జెడ్పీహెచ్ఎస్ దుర్శేడ్, తెలంగాణ రాష్ట్ర నమూనా పాఠశాల మానకొండూర్ విద్యార్థులకు కళాశాల నిపుణులు మార్గదర్శకత్వం అందించనున్నారు. ఆవిష్కరణలు, వ్యాపార ఆలోచనలు, నమూనాల అభివృద్ధి, మేధో సంపత్తి హక్కులు, నూతన సంస్థల ఏర్పాటుపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కళాశాల ప్రయోగశాలల సహకారంతో విద్యార్థుల ఆలోచనలను నమూనాలుగా అభివృద్ధి చేసి, జిల్లా స్థాయిలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమానికి ఎంపిక కావడంపై జాయింట్ సెక్రెటరీ డాక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ సభ్యులు వినోద్, సీహెచ్. ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్, కార్యక్రమ సభ్యులు డాక్టర్ జీఎస్. అరుణ్‌కుమార్, బి. రామ్మోహన్ హర్షం వ్యక్తం చేశారు.

## ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

### కాంగ్రెస్ శ్రేణులకు రూప్లా నాయక్ పిలుపు

**ధర్మారం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో ధర్మపురి పర్యటనకు రానున్న నేపథ్యంలో పత్తిపాక ఎక్స్‌రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికి, అక్కడి నుంచి బైక్ ర్యాలీతో ధర్మపురి వరకు తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ ధర్మారం మండల అధ్యక్షుడు లావుడ్య రూప్లా నాయక్ పిలుపునిచ్చారు.
పార్టీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. పర్యటనకు స్వాగతం పలికేందుకు పత్తిపాక ఎక్స్‌రోడ్డు నుంచి ధర్మపురి వరకు పార్టీ శ్రేణులు ఫ్లెక్సీలు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## గొల్లపల్లి క్లస్టర్‌లో క్రాప్ బుకింగ్ నమోదు



**టేకులపల్లి, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి):**
గొల్లపల్లి క్లస్టర్ పరిధిలో శనివారం క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని ఏఈఓ బి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించి, క్రాప్ బుకింగ్ నమోదు విధానం, దాని ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇల్లెందు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ బుర్ర ధర్మయ్య గౌడ్‌తో పాటు రైతులు విజయమోహన్‌రావు, నారందాసు, నరసింహారావు, బండి శంకర్‌గౌడ్, లావుడియా సురేష్‌నాయక్, చలమల నరేందర్‌గౌడ్, వాంకుడోత్ రవీందర్, వెంకటేశ్వరరావు నాయక్, వాంకుడోత్ బాలు నాయక్, బోడ జగదీష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం, సెప్టెంబర్ 6, 2026

## కొల్లి ఫౌండేషన్ మండల ఇన్‌చార్జీలుగా కవిత, కృష్ణవేణి

### మహిళల సమస్యలు, సాధికారత, సంక్షేమం కోసం కృషి



**లక్ష్మీదేవిపల్లి (సూర్యోదయ వార్త)**
లక్ష్మీదేవిపల్లి మండలంలో మహిళల సమస్యలు, సాధికారత, సంక్షేమ కార్యక్రమాలపై పనిచేసేందుకు కొల్లి ఫౌండేషన్ మండల ఇన్‌చార్జీలుగా కె.కవిత, జె.కృష్ణవేణిని నియమించింది. ఫౌండేషన్ చైర్‌పర్సన్ కల్పనా చౌదరి వారి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. మహిళలకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కల్పనా చౌదరి సూచించారు. మహిళల అభ్యున్నతి, ఆత్మగౌరవం, స్వావలంబన కోసం కృషి చేస్తామని కవిత, కృష్ణవేణి తెలిపారు.

## పార్టీ కోసం 43 ఏళ్లు పనిచేసిన నేతకు ఇదేనా గౌరవం?

### - లక్ష్మణ్ మృతదేహాన్ని పరామర్శించని టీడీపీ అగ్రనాయకత్వంపై స్థానిక నేతల ఆగ్రహం





**కొత్తగూడెం (సూర్యోదయ వార్త)**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి 43 ఏళ్లుగా పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన సీనియర్ నాయకుడు ఊటుకూరి లక్ష్మణ్ మృతిచెందినా పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ స్థాయి నాయకులు కనీసం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించకపోవడం బాధాకరమని స్థానిక టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 1983లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన నాటి నుంచి లక్ష్మణ్, ఆయన కవల సోదరుడు రాము పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. ఇటీవల రాము మృతిచెందగా, తాజాగా లక్ష్మణ్ గుండెపోటుతో మృతిచెందడం కుటుంబంతో పాటు పార్టీకి తీరని లోటన్నారు. చూపు కోల్పోయిన లక్ష్మణ్ వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా, అది అందకుండానే మృతిచెందారని పేర్కొన్నారు. కనీసం అంత్యక్రియల సమయంలోనైనా పార్టీ నాయకత్వం స్పందించకపోవడం కార్యకర్తల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. స్థానిక నాయకులు లక్ష్మణ్ మృతదేహంపై పార్టీ కండువా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇల్లెందు నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ, పొన్నెకంటి సంజీవరాజు (టీడీపీ రాజు), బంగారి హరి, సామల మల్లికార్జున్, కంచం నాగులు, సురేష్ గౌడ్, గాధం రమణ తదితరులు పాల్గొన్నారు.